క్లుప్తంగా

మానవత్వ విలువలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న కమలకుమారి

సాక్షి, భీమవరం: విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికబద్ధమైన విద్యను అభ్యసిస్తూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని నన్నయ్య విశ్వవిద్యాలయం కాకినాడ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి అన్నారు. శనివారం భీమవరం విష్ణు డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మానవత్వ దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే మానవత్వ విలువలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్ర కరపత్రాల పంపిణీ



భీమవరంలో కరపత్రాలను చూపుతున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

సాక్షి, భీమవరం: రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అంటూ సీపీఐ చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని భీమవరంలో శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ సమితి కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన తణుకు నిర్వహించే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బంగారు శివ, దుర్గారావు, సత్యనారాయణ, నీలపు శ్రీను, కిల్లరి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా వర్మ మరోసారి నియామకం



భూపతిరాజు శ్రీనివాస వర్మ

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన భూపతిరాజు శ్రీనివాస వర్మను బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా ఆ పార్టీ రాష్ట్ర శాఖ తిరిగి నియమించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కార్యవర్గంలోనూ వర్మ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉండటంతో పాటు అనేక విద్యారంగ సమస్యలపై పోరాటం చేసిన వర్మ బీజేపీలో పట్టణ స్థాయి నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యునిగా వివిధ హోదాల్లో పార్టీకి సేవలందిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షునిగా దీర్ఘకాలం పనిచేసిన వర్మ భీమవరం మున్సిపల్ ప్యానెల్ చైర్మన్‌గా పనిచేశారు. వర్మకు పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి కుటుంబం అభివృద్ధి చెందినప్పుడే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు సందర్భంగా నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని శనివారం రెండో పట్టణంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిర్వహించారు. ముందుగా విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను ప్రపంచానికి చాటి చెప్పడానికి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ఏడాది పాటు నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఆనాడు దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎంతో మంది మహనీయులు త్యాగధనులుగా మిగిలారని, అయితే నేడు త్యాగధనుల కుటుంబాలను ఆదుకునే దిశగా ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. పిల్లలు, విద్యార్థులు, యువతలో దేశభక్తిని పెంపొందించడానికి, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలను వారికి తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎంఈఓ త్రినాధరావు, చెరుకువాడ రంగసాయి, కోమటి రాంబాబు, కొప్పర్తి సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమవరంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

వైఎస్సార్ సీపీని విజయపథంలో నడిపిద్దాం

- పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- ఉండి నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఆకివీడు: వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎల్ నర్సింహరాజును వచ్చే ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ పరిశీలకురాలు, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లగోళ్ల శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో శనివారం పార్టీ పట్టణ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీలక్ష్మి మాట్లాడుతూ పార్టీలో చిన్నచిన్న సమస్యలు సహజమన్నారు. వాటిని కూర్చుని సరిజేసుకుంటే జగమంత కుటుంబం మనది అవుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే మనందరి లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో పీవీఎల్ నర్సింహరాజు గెలుపునకు అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు నీచమైన మాటలాడుతున్నారని ఆరోపించారు. ప్యాకేజీ స్టార్‌తో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని ప్రజలు ఇప్పటికే గ్రహించారన్నారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, జి.ధనరాజు, గుండా సుందర రామనాయుడు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, అంబటి రమేష్, శిరపు శ్రీనివాస్, ఎండీ సిద్ధిక్, జహంగీర్, షేక్ హుస్సేన్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు ఎండీ మస్తాన్ వలీ, మోటుపల్లి గంగాధరరావు, పలువురు కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం



గొల్లలకోడేరులో వార్డు సభ్యురాలు నాగమణిని అభినందిస్తున్న పీవీఎల్



మత్స్యపురిలో వార్డు మెంబర్‌గా ఎన్నికైన విజయలక్ష్మితో మద్దతుదారులు

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పాలకోడేరు: గొల్లలకోడేరు పంచాయతీ ఆరో వార్డు మెంబర్ ఎన్నికలో ప్రజలు ఇచ్చిన తీర్పు అరాచక పాలనకు చరమగీతం అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చేకూరి రాజా నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఆరో వార్డు అభ్యర్థి సంబలదీవి నాగమణి విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో జరిగిన అభినందన కార్యక్రమానికి పీవీఎల్ హాజరై మాట్లాడారు. గ్రామస్తులంతా ఏకతాటిపై నిలబడి అభ్యర్థి నాగమణి విజయానికి కృషి చేసినందుకు అభినందనలు తెలుపుతున్నానన్నారు. రాజా నరేంద్ర కుమార్ రాజు మాట్లాడుతూ పంచాయతీలో జరుగుతున్న అవినీతి, అరాచక పాలనకు వ్యతిరేకంగా విజయం సాధించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటి రాజు), సర్పంచ్‌ల ఛాంబర్ మండల అధ్యక్షుడు భూపతి రాజు వంశీకృష్ణమ రాజు, ఎంపీటీసీ సభ్యురాలు కరోతి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బరిలో ముగ్గురు అభ్యర్థులు

ఎన్నికల బరిలో ముగ్గురు అభ్యర్థులు నిలవగా సంబల దీవి నాగమణికి 168 ఓట్లు, మరో అభ్యర్థి పడమటి రామలక్ష్మికి 126 ఓట్లు, ఇంకో అభ్యర్థి సువ్వాడ మోహినికి మూడు ఓట్లు లభించాయి. అలాగే నోటాకు ఒకటి, చెల్లని ఓట్లు మూడు పడ్డాయి. దీంతో ప్రత్యర్థులపై సంబల దీవి నాగమణి 42 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. ఆరో వార్డులో మొత్తం 346 ఓటర్లు ఉండగా, 300 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల అధికారి శివవృష్ణ నాగమణిని గెలుపును ప్రకటించి నియమక పత్రాన్ని అందజేశారు. భీమవరం రూరల్ సీఐ నాగప్రసాద్, ఎస్సై నాళం శ్రీనివాసరావు బందోబస్తు నిర్వహించారు.

మత్స్యపురిలో కారేపల్లి విజయలక్ష్మి గెలుపు

వీరవాసరం: మండలంలోని మత్స్యపురి గ్రామ పంచాయతీ ఒకటో వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి కారేపల్లి విజయలక్ష్మి ఘన విజయం సాధించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహించగా, మొత్తం 292 ఓట్లకు గానూ 234 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ బలపర్చిన కారేపల్లి విజయలక్ష్మికి 197 ఓట్లు రాగా, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇచ్చిన ఉమ్మడి అభ్యర్థి కారేపల్లి కమల కుమారికి కేవలం 37 ఓట్లు మాత్రమే వచ్చాయి. కారేపల్లి విజయలక్ష్మికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంఎస్‌వీ శ్రీమన్నారాయణ ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

టీడీపీ, జనసేనకు బుద్ధి చెప్పిన ఓటర్లు



విజయలక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: దళిత వర్గంలో చీలికతెచ్చి తద్వారా లబ్ధి పొందాలని భావించిన టీడీపీ, జనసేన నాయకులకు మత్స్యపురి పంచాయతీ వార్డు ఎన్నికలో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం మత్స్యపురి పంచాయతీలో శనివారం వార్డు పదవికి జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన కారేంపల్లి విజయలక్ష్మి విజయం సాధించగా, ఆమె భీమవరంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన బలపర్చిన అభ్యర్థి కారేంపల్లి కమల కుమారిపై విజయలక్ష్మి 167 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారన్నారు. మత్స్యపురి పంచాయతీ ఒకటో వార్డులో పూర్తిగా దళిత ఓటర్లే ఉన్నందున పోటీ లేకుండా ఏకగ్రీవం చేసుకుందామని జనసేన, టీడీపీ నాయకులను కోరినప్పటికీ ఆ రెండు పార్టీల నాయకులు కలిసి రాలేదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేయడం వల్లనే వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించారన్నారు. ముందుగా విజయలక్ష్మిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ×సామాజిక జీవనంలో యోగా ఆవశ్యకత్తపై బెంగళూరులోని యోగా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ కుంభంపాటి సుబ్రహ్మణ్యం అవగాహన కల్పించారు. యోగాను వైజ్ఞానికంగా ఎలా ఉపయోగించుకుని జీవన ప్రయాణాన్ని కొనసాగించాలో విశదీకరించారు. వివేకానందుడు భారత వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, కొండేటి వెంకట రాజు, దాయన చంద్రాజీ పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ ఫొటోగ్రఫీ డే



భీమవరంలో ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న తహసీల్దార్ రవికుమార్

సాక్షి, భీమవరం: వరల్డ్ ఫొటోగ్రఫీ డేను జిల్లా ప్రొఫెషనల్ ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భీమవరం తహసీల్దార్ వై.రవికుమార్ హాజరై మాట్లాడారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ సహకారంతో ఫొటోగ్రాఫర్ ధూళిపాటి నాగేశ్వరావుకు వైద్యం నిమిత్తం రూ.25,555 చెక్కును తహసీల్దార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వడ్డీ నటరాజ్ గిరి, కాళ్ళ నాగు, గౌరవాధ్యక్షుడు పోసింశెట్టి మురళీకృష్ణ, ఏలేటి న్యూటన్, వేగిరెడ్డి రంగ సూర్య, బొర్రా రాకేష్‌బాబు, మండేపూడి చంద్రశేఖర్, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: గత స్మృతుల్ని నెమరు వేసుకునేందుకు ఫొటోగ్రఫీ ఎంతో ఉపయోగపడుతుందని కౌన్సిలర్ గేదల అప్పారావు అన్నారు. వరల్డ్ ఫొటోగ్రఫీ డే పురస్కరించుకుని శనివారం స్థానిక సీనియర్ ఫొటోగ్రాఫర్, అసోసియేషన్ అధ్యక్షుడు నందాను సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అప్పారావు మాట్లాడుతూ కదిలే కాలాన్ని బంధించే సత్తా ఒక్క ఫొటోగ్రాఫర్‌కే ఉందన్నారు. సెల్‌ఫోన్ల వాడకం పెరగడంతో ఫొటోగ్రఫీ మరింత శులభమైందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఉండి నియోజకవర్గ ఎన్నికల అధికారి మల్లికార్జునరావు

ఉండి: ఓటర్ల జాబితా పరిశీలనను వేగవంతం చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీకే మల్లికార్జునరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఉండిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లతో ఓటర్ల జాబితా పరిశీలనపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 86 శాతం ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే పూర్తయ్యిందని తెలిపారు. ఈనెల 21 నాటికి నూరుశాతం పూర్తి చేయాలని, పూర్తి చేయని వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. బీఎల్‌వోల డైరీని తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఓటర్ల సర్వేలో అధికారులు ఎటువంటి ఒత్తిళ్ళకు లొంగకూడదన్నారు. సమావేశానికి తహసీల్దార్లు ఎస్.విజయలక్ష్మి, ఏఎస్ వీరాస్వామి నాయుడు, ఎ.కృష్ణారావు, ఎస్‌కే హుస్సేన్, ఎంపీడీవోలు జి.స్వాతి, కె.వాణి, ఏవీ అప్పారావు, ఎంఎస్ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జల కాలుష్యంతో ఆక్వా సాగుకు నష్టం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వంశీ నాగరాజును సత్కరిస్తున్న పాలకవర్గం

సాక్షి, భీమవరం: భూగర్భ జల కాలుష్యంతో ఆక్వా సాగుకు నష్టం వాటిల్లుతోందని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, యంగ్ జియో టెక్నికల్ ఇంజినీర్ అవార్డు గ్రహీత డాక్టర్ తోటకూర వంశీ నాగరాజు చెప్పారు. ఎన్ఐటీ సూరత్కల్ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పొందిన సందర్భంగా శనివారం ఆయనను కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా వంశీ నాగరాజు మాట్లాడుతూ ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల్లో ఆక్వా చెరువుల కారణంగా భూగర్భ జలాలు కలుషితమైనందున ఆ నీరు ఆక్వా సాగుకు పనికి రాదన్నారు. తన పరిశోధనా సమయంలో పరిశీలించిన అంశాలను వివరించారు. ఇటీవల కాలంలో విస్తరిస్తున్న ఆక్వా సాగులో కాలుష్యం పెరుగుతున్నందున ఇంజినీర్ల సూచనలు సలహాలతోనే ఆక్వా మనుగడ సాధ్యమన్నారు. ఆక్వా సాగులో ఉపయోగిస్తున్న రసాయనాలు నీటి అడుగు భాగానికి చేరి భూమి సాంద్రతను హరించేలా చేస్తున్నాయన్నారు. ఆక్వా చెరువుల్లోకి భూగర్భ జలాలను వినియోగించే ముందు తప్పనిసరిగా టెక్నాలజీని ఉపయోగించి శుద్ధి చేయాలన్నారు. అడ్వాన్స్‌డ్ టూల్స్ డెవలప్ చేసి వాటి ద్వారా తాను పరిశోధనలు చేసినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు, పాలకవర్గం ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, సాగి సత్యప్రతీక్ వర్మ తదితరులు వంశీనాగరాజును సత్కరించారు.

9న జాతీయ లోక్ అదాలత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సురేష్‌బాబు

సాక్షి, భీమవరం: భీమవరం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్జి జి.సురేష్‌బాబు కోరారు. శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులో కేసులు వాదోపవాదాల అనంతరం ఒకరే గెలిచే అవకాశం ఉంటుందని, లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకుంటే ఇరువురు గెలుస్తారన్నారు. కక్షిదారులు రాజీ మార్గాన్ని ఎంచుకుంటే సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటాయని సురేష్‌బాబు వివరించారు. రాజీయే రాజ మార్గమని, రాజీ చేసుకోదగిన క్రిమినల్, చెక్ బౌన్స్, సివిల్ తగదాలు, వాహన ప్రమాదం వంటి కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో భీమవరం రూరల్ సీఐ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి గెలుపు పట్ల హర్షం

వీరవాసరం: మత్స్యపురి గ్రామంలో వైఎస్సార్ సీపీకి ఓటర్లు పట్టం కట్టడం ఎంతో ఆనందంగా ఉందని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు అన్నారు. వార్డు మెంబర్ ఎన్నికలో కారేపల్లి విజయలక్ష్మి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో శనివారం ఆమెను వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యాన సంక్షేమం, అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతోందని, అందుకే ప్రజలంతా ప్రభుత్వానికి అండగా నిలిస్తున్నారనడానికి ఈ ఎన్నిక ఒక ఉదాహరణ అని అన్నారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో సైతం ప్రజలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలుస్తారని, దీనిలో ఏ మాత్రం సందేహం లేదని ధీమా వ్యక్తం చేశారు. అభినందనలు తెలిపిన వారిలో పార్టీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం, మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు, గోడి షణ్ముఖరావు, గూడూరు కొండ, మానుకొండ ప్రదీప్ కుమార్, కొండేటి బాబి, కుర్రెళ్ల కాశి, బళ్ల పెన్నయ్య తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మద్యం, మాదక ద్రవ్యాల వైపు కౌమార దశలో ఉన్న విద్యార్థులు ఆకర్షితులు కావద్దని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ సైకాలజిస్ట్ టి.గంగాధర్ సూచించారు. పట్టణంలో శనివారం సొసైటీ ఆధ్వర్యంలో సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీపీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ సహకారంతో సీపీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా విద్యార్థుల కోసం ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. సిబ్బంది హరిప్రకాష్, ధీరజ్‌లు మాట్లాడుతూ యువతను వ్యసనాల నుంచి విముక్తులను చేసేందుకు పీర్ ఎడ్యుకేటర్స్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుజాత, ఉపాధ్యాయులు. సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాలో సత్తా చాటిన దండగర్ర విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు యోగా జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటారు. సబ్ జూనియర్ విభాగంలో ఆకుల వెంకన్న బాబు (ప్రథమం), జూనియర్ విభాగంలో రుద్ర రాఘవ (ప్రథమ), సీనియర్ విభాగంలో చెరుకు వడ్డి కాసులు (తృతీయ స్థానం) విజయం సాధించారు. పురుషుల విభాగంలో పాఠశాల పీడీ చంద్రశేఖర్ ప్రథమ స్థానంలో నిలిచారు. సెప్టెంబరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్ అభినందించారు.